సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ¦ 11 ¦ నవంబర్ ¦ 2023



'కారు' తొలిసారి!

పలువురు ఎమ్మెల్యేలు తొలిసారిగా కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచారు.

IIలో



పాఠశాలకు తాళం..

డిప్యూటేషన్‌పై ఇంకో పాఠశాలకు వెళ్లిన టీచర్‌ను తిరిగి తమ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులు నిరసన తెలిపారు.

IIలో

గరిష్టం / కనిష్టం
33° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి వేళ చలి ప్రభావం కనిపిస్తుంది.

ఐదింటిలో 136..

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు	పినపాక	ఇల్లెందు	కొత్తగూడెం	అశ్వారావుపేట	భద్రాచలం
	25	34	36	23	18





నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా, నామినేషన్‌కు ముందు తన తండ్రి, మాజీ సీఎం జలగం వెంగళరావు ఫొటోకు నమస్కరిస్తున్న వెంకటరావు

ఎన్నికల ప్రక్రియలో ముగిసిన నామినేషన్ల ఘట్టం

- జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు
- కొత్తగూడెంలో 36, భద్రాచలంలో 18
- 13న పరిశీలన, 15న ఉపసంహరణకు అవకాశం
- ఇల్లెందు, పినపాకలో కాంగ్రెస్‌కు రెబల్స్ బెడద

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 136 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో కొందరు అభ్యర్థులు మరోసారి నామినేషన్ వేసేందుకు ఆసక్తి చూపించారు.

చివరి రోజు భారీగా నామినేషన్లు..

జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తంగా 136 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నుంచి 36 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లకు చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా భారీ స్థాయిలో నామినేషన్లు వేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకున్న వారికి నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. చివరి రోజు పినపాకలో 12, ఇల్లెందులో 15, కొత్తగూడెంలో 14, అశ్వారావుపేటలో 8 మంది, భద్రాచలంలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

కాంగ్రెస్‌కు రెబల్స్ బెడద

కాంగ్రెస్ పార్టీ ఆచీతూచీ వ్యవహరిస్తూ మూడు జాబితాల్లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించింది. అయినా ఆ పార్టీకి రెబల్స్ బెడద తప్పలేదు. ఇల్లెందు నుంచి అత్యధికంగా రెబల్స్ బరిలో ఉన్నారు. ఇక్కడి నుంచి చీమల వెంకటేశ్వర్లు, కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్, డాక్టర్ జీ రవి, జీ. నాగమణి, బానోత్ స్రవంతి, విజయలక్ష్మి, మంగీలాల్ నాయక్ నామినేషన్లు వేశారు. అశ్వారావుపేట నుంచి సున్నం నాగమణి, పినపాక నుంచి బట్టా విజయ్‌గాంధీలు నామినేషన్లు వేశారు. దీంతో వీరిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ పెద్దలు ప్రయత్నాలు మొదలెట్టారు. కాగా కొత్తగూడెంలో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన ఎడవల్లి కృష్ణ కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. భద్రాచలం నుంచి సీపీఐ నేత రావులపల్లి రాంప్రసాద్ ఆ పార్టీ వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. ఇల్లెందు నుంచి మడత వెంకట్ గౌడ్ కారెక్కారు.

కొత్తగూడెంపై ఆసక్తి

గతేడాది నామినేషన్ సందర్భంగా వనమా సమర్పించిన అఫిడవిట్ వివాదాలకు తావివ్వడంతో ఈసారి ఆయన నామినేషన్‌పై జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. దానికి తగ్గట్టే మద్దతుదారులతో కలిసి వనమా వెంకటేశ్వరరావు రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చారు. కొద్దిపాటి తేడాతో వనమాపై కేసు వేసిన జలగం వెంకట్రావు కూడా నామినేషన్ వేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరువురి నేతలకు చెందిన అభిమానులు, మద్దతుదారులు పోటాపోటీగా జై వనమా, జై జలగం అనే నినాదాలు చేస్తూ హోరెత్తించారు. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలు గుమిగూడకుండా చెదరగొట్టారు. కాగా కొద్దిరోజులుగా స్తబ్దుగా ఉన్న జలగం వెంకట్రావు నామినేషన్ వేయడంతో కొత్తగూడెంపై మరింత ఆసక్తి పెరిగింది.

15న స్పష్టత

శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అయితే ఆ తర్వాత వరుసగా రెండో శనివారం, ఆదివారం వంటి సెలవు దినాలు రావడంతో ఎన్నికల ప్రక్రియకు స్వల్ప బ్రేక్ పడనుంది. తిరిగి 13న దాఖలైన అన్ని నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఒకరోజు అభ్యర్థులకు గడువు ఇస్తారు. నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు ఈ నెల 15న అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాతే ఏ నియోజకవర్గం నుంచి ఎంతమంది అభ్యర్థులు బరిలో ఉంటారనేది స్పష్టత రానుంది. అప్పటి నుంచి ఎన్నికల ప్రచారం మరో అంకానికి చేరనుంది. రెండు వారాలపాటు విస్తృత ప్రచారం అనంతరం ఈ నెల 30న పోలింగ్ జరగనుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహించనున్నారు.

గుర్తు కోసం..

ఎప్పటిలాగే ప్రధాన పార్టీల నుంచి టికెట్ దక్కని అభ్యర్థులు ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ తరఫున నామినేషన్లు దాఖలు చేశారు. ఇల్లెందు నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన చీమల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం నుంచి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావులు ఈ పార్టీ తరఫున పోటీలోకి దిగారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు సింహం గుర్తు కేటాయించే అవకాశం ఉంది. కాగా బీజేపీ పొత్తులో భాగంగా అశ్వారావుపేట, కొత్తగూడెం సీట్లను జనసేనకు కేటాయించింది. అయితే ప్రస్తుతం జనసేనకు సంబంధించిన గ్లాసు గుర్తు ఫ్రీ సింబల్‌గా అందరికీ అందుబాటులో ఉంది. దీంతో దీంతో జనసేన అభ్యర్థులకు ఏ గుర్తు కేటాయిస్తారనే అంశంపై గందరగోళం నెలకొంది.

వనమా ఆదాయ వివరాలు..

- కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి వనమా వెంకటేశ్వరావు గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను శాఖకు రూ. 33,95,521 ఆదాయాన్ని చూపారు. ఆయన భార్య పద్మావతి పేరు మీద రూ. 12,94,239 ఆదాయాన్ని చూపారు.
- వనమా వెంకటేశ్వరావు పేరు మీద ఫార్చ్యునర్ కారు ఉండగా ఆయన భార్య పేరు మీద ఇన్నోవా వాహనం ఉంది. వనమాకు సంబంధించి రింగులు, చైన్లు వంటి బంగారు ఆభరణాలన్నీ కలిపి రూ.2,86,000 విలువ చేసే 52 గ్రాముల బంగారం ఉంది. ఆయన భార్య పేరు మీద రూ. 13,75,000 విలువ చేసే 250 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వనమా రూ. 1,29,78,000 విలువైన స్థిరాస్తులను ప్రకటించారు. ఇక అప్పులు, బకాయిలు లేవని పేర్కొన్నారు. కాగా వనమా భార్య వనమా పద్మావతి కొత్తగూడెం స్థానం నుంచి డమ్మీ నామినేషన్‌ను దాఖలు చేశారు.

నేటి నుంచి బాణసంచా అమ్మకాలు



కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

- జిల్లా వ్యాప్తంగా 137 షాపులకు అనుమతులు
- కొత్తగూడెం, పాల్వంచలలో హోల్‌సేల్ దుకాణాలు
- వ్యాపారులు రక్షణ చర్యలు పాటించాలి : ఫైర్ ఆఫీసర్

కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగ హడావుడి నెలకొంటోంది. రకరకాల మతాబులు అమ్మేందుకు వ్యాపారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అన్ని ఏరియాల్లో టపాసుల దుకాణాలు సిద్ధమయ్యాయి. జిల్లాలో టపాసులను విక్రయాలకు శుక్రవారం వరకు 137 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పుల్లయ్య తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచలలో ఒక్కోటి చొప్పున హోల్‌సేల్ షాపులకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని రక్షణ చర్యలు పాటించాలని సూచించారు.

రెండు హోల్‌సేల్ దుకాణాలు

జిల్లాలో శనివారం నుంచి బాణసంచా అమ్మకాలు ప్రారంభంకానున్నాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో 37, పాల్వంచలో 12, ములకలపల్లి 2, రామవరంలో 6, చంద్రుగొండలో 2, రుద్రంపూర్‌లో 1, జూలూరుపాడులో 2, హోల్‌సేల్ షాపులు కొత్తగూడెం (సుజాతనగర్ వేపలగడ్డ)లో 1, పాల్వంచ(కుంటి నాగులగూడెం)లో ఒకటి చొప్పున.. మొత్తం 64 షాపులకు అనమతులు వచ్చాయి. ఇల్లెందు పట్టణంలో 30 దుకాణాలు, భద్రాచలంలో 8, చర్లలో 4, సారపాకలో 1, బూర్గంపాడులో 1, అశ్వాపురంలో 2, మణుగూరు సంతగ్రౌండ్‌లో 13, అశ్వారావుపేటలో 14, వినాయకపురంలో 2, మందలపల్లిలో 4, అశ్వారావుపేటటౌన్‌లో ఎనిమిది.. మొత్తం 138 షాపులకు దరఖాస్తులు చేసుకోగా, అధికారులు 137 షాపులకు అనుమతులు ఇచ్చారు.

జాగ్రత్తగా ఉండాలి



అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకుని టపాసుల షాపులు ఏర్పాటు చేసుకోవాలి. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి షాపు ముందు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవు. టపాకాయలు కాల్చుతున్న సమయంలో అతిధ్వనులు (శబ్దాలు) వచ్చే వాటికి దూరంగా ఉండాలి. సాధారణంగా 60 నుంచి 80 డెసిబెల్స్ ధ్వనితో ఇబ్బంది ఉండదు. 120 డెసిబెల్స్ దాటితే నొప్పి వస్తుంది. కర్ణభేరి పగిలి కొన్నిసార్లు వినికిడి శక్తి కోల్పోతారు. అధిక పొగ వెలువడే బాణసంచాతో ముక్కుకు ప్రమాదం తప్పదు. టపాసుల వల్ల వచ్చే రసాయన పొగ వల్ల అనారోగ్యం పాలవుతారు.

–పుల్లయ్య, కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్

అనుమతులు తప్పనిసరి



టపాసుల షాపులకు అనుమతులు తప్పనిసరి. అనుమతి లేకుండా అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవు. షాపుల యజమానులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలి. ప్రతి షాపు దగ్గర ప్రజల కోసం రక్షణ చర్యలు చేపట్టాలి. టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించి ప్రాణాలకు ముప్పు లేకుండా చూసుకోవాలి. టపాసుల షాపులకు మద్యం మత్తులో రావద్దు. అగ్ని ప్రమాదాలు జరగకుండా షాపు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పండుగను ఆనందంగా జరుపుకోవాలి.

–ఎం.కరుణాకర్, వన్‌టౌన్ సీఐ, కొత్తగూడెం

పోలింగ్ కేంద్రాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు అజయ్ లాల్‌చంద్

చర్ల: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు అజయ్ లాల్ చంద్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎన్నికలపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలు, మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోని కేంద్రాలు, దూరపు గ్రామాల నుంచి ఓటర్ల తరలింపునకు రవాణా ఏర్పాట్లపై చర్చించారు. తొలుత మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. చర్లలోని నిఘా బృందంతో మాట్లాడి పరిస్థితులు, తనిఖీలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆర్.అనంతర రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తాటి వెంకటేశ్వర్లు, సీఐ బి.రాజగోపాల్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎన్నికల లైజన్ ఆఫీసర్, సీతారామనాయక్, ఆడిటర్లు రాజు, శ్రీను, ఆర్‌ఐలు వెంకటేశ్వరావు, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎన్నికల పరిశీలకుడికి కలెక్టర్ స్వాగతం



మొక్కను అందజేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నియమితులైన గణేష్ శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. సింగరేణి అతిథి గృహంలో ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో డీఈఓ వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: చిన్నతనం నుంచే సైన్స్ పట్ల అభిరుచి, అవగాహన, ఆసక్తి ఉంటే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశోధనల పట్ల అవగాహన పెంపొందించుకుందేకు బాలల సైన్స్ కాంగ్రెస్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు మొత్తం 96 ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో నాలుగు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గౌతంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్, భద్రాచలం సెయింట్ పాల్స్ , మణుగూరు భాషా హై స్కూల్, కొత్తగూడెం త్రివేణి స్కూల్ జిల్లాలో ఉత్తమంగా నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఆయా ప్రాజెక్టుల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సింగరేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, విద్యాశాఖ అధికారులు నాగరాజశేఖర్, సతీష్, పి.ప్రభాకర్‌రావు, బి.సంపత్‌కుమార్, న్యాయ నిర్ణేతలు బి.మాధవి, పావని, వైష్ణవి పాల్గొన్నారు.

హాజరు వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు వివరాలను యాప్‌లో నమోదు చేయాలని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. శుక్రవారం ఆయన ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ముఖచిత్ర హాజరు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూడైస్ ప్లస్ పోర్టల్‌లో కూడా హాజరు నమోదు చేయాలని, సోమవారం వరకు ఈ ప్రక్రియ పూర్తికావాలని సూచించారు. హాజరు, అడ్మిషన్ రిజిస్టర్లలో విద్యార్థి శాశ్వత విద్యా సంఖ్య నమోదు చేయాలన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి అసంతృప్తులు!



ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ వద్దిరాజు సమక్షాన బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, నేతలు ఎడవల్లి కృష్ణ, డాక్టర్ రామచందర్‌నాయక్, కోటూరి మానవతారాయ్ తదితరులు

- గులాబీ గూటికి సంభాని, ఎడవల్లి, ఊకె అబ్బయ్య, మానవతారాయ్
- ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షాన కారెక్కిన నేతలు
- సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, వైరాలో కాంగ్రెస్‌కు షాక్
- ఫలించిన ఎంపీలు వద్దిరాజు, నామ, ఎమ్మెల్యే సండ్ర మంత్రాంగం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ నేతలు పలువురు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కొన్నిరోజులుగా ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన చర్చలతో ఆయా ముఖ్యనేతలు కారెక్కారు. పార్టీలో టికెట్లు దక్కక అసంతృప్తితో ఉన్న నేతలు శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షాన బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత వీరు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. మాజీ మంత్రి సంభానితోపాటు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్యతోపాటు ఎడవల్లి కృష్ణ, కోటూరి మానవతారాయ్, డాక్టర్ రామచందర్‌నాయక్, మడత వెంకట్‌గౌడ్‌తోపాటు పలువురు నేతలకు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆయా నేతలను ముందు కేటీఆర్ వద్దకు, ఆ తర్వాత సీఎం కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్లారు.

రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లోకి..

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సత్తుపల్లి నుంచి టికెట్ వస్తుందన్న ధీమాతో వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీలోనూ టికెట్ విషయంలో ముఖ్య నేతలను కలిసినా టికెట్ రాగమయికి కేటాయించిన రోజే ఆయన పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేయబోనని ప్రకటించిన వెంటనే ఎంపీలు వద్దిరాజు, నామ, ఎమ్మెల్యే సండ్ర ఆయనను బీఆర్‌ఎస్‌లోకి తీసుకునేందుకు పావులు కదిపారు. ఆ తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సంభాని ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు నేతలు..

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ టికెట్లు దక్కని ఆశావహులు పలువురు ఇదే బాట పట్టారు. కొత్తగూడెంకు చెందిన ఎడవల్లి కృష్ణ టికెట్ ఆశించగా పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. దీంతో ఆయనతోనూ ఎంపీ వద్దిరాజు మాట్లాడి బీఆర్‌ఎస్‌లోకి తీసుకొచ్చారు. అలాగే వైరా నియోజకవర్గానికి చెందిన రామచంద్రనాయక్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయనతోపాటు ఇల్లెందు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన కోటూరి మావతారాయ్ సహా కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్న పలువురు నేతలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకోగా... ఎంపీ వద్దిరాజు వీరిని తొలుత మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ మెజార్టీ స్థానాలు గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సీఎం కేసీఆర్ వద్దకు వీరిని తీసుకెళ్లడంతో కండువాలు కప్పి పార్టీలో చేరిన నాయకుల సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులకు తెలిపారు.

సమష్టి కృషితో బీఆర్‌ఎస్ బలోపేతం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ నాయక్ సమిష్టి కృషితో బీఆర్‌ఎస్‌లో పలువురు ముఖ్య నేతలు చేరారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఈసందర్భంగా వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలకు తోడు ఉమ్మడి బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారశైలితో పదికి పది స్థానాలు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ..

ముఖ్యనేతలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ తగిలిందనే చెప్పాలి. ఆ పార్టీ టికెట్లు ప్రకటించి నిరాశకు గురైన వీరిని బుజ్జగించేందు యత్నాలు జరగకపోవడం... బీఆర్‌ఎస్ నేతలు పావులు కదిపి పార్టీలో చేర్చుకున్నారు. దీంతో అసంతృప్త నేతలను పార్టీ వైపు తిప్పుకోవడంలో ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలు చేసిన కృషి ఫలించినట్లయింది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొండరెడ్లకు వైద్యసేవలు



వైద్య పరీక్షలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

దమ్మపేట: మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలోని కొండరెడ్ల కోసం శుక్రవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ శిరీష ప్రారంభించి మాట్లాడారు. కొండరెడ్లకు అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలను నిర్వహించారు. బాధితులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, డీఐఓ బాలాజీ నాయక్, మలేరియా ఆఫీసర్ స్పందన, డాక్టర్ దివాకర్, సీహెచ్‌ఓ నాగభూషణం, బషీరుద్దీన్, ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బెస్ట్ కేడెట్ అవార్డు అందుకుంటున్న చరణ్

మణుగూరు రూరల్/అశ్వాపురం: వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఇటీవల జరిగిన ఎన్‌సీసీ దినోత్సవంతో పాటు ఇతర పోటీల్లో అశ్వారావుపేట మండలం మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన టి.చరణ్ 11(టీ) బెటాలియన్ ఖమ్మం తరఫున పాల్గొని బెస్ట్ కేడెట్ అవార్డును వరంగల్ గ్రూప్ కమాండర్ ఎస్‌ఏ సచిన్ సెంబల్కర్ చేతుల మీదుగా అందుకున్నాడు. అలాగే, ఎం.ఉదయ్‌కిరణ్ హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో ఛాంపియన్‌గా నిలిచాడు. ఇక ఎస్.శ్రీహరి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కాగా, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జి.స్వప్నకుమారి, అధ్యాపకులు అభినందించారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ



పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్ తదితరులు

దమ్మపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 13న భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని మల్లారం గ్రామంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మైదానం, ఏర్పాట్లను ఎస్పీ వినీత్ శుక్రవారం పరిశీలించారు. హెలీప్యాడ్, స్టేజీ పనులను పరిశీలించిన ఆయన పోలీసులకు పలు సూచనలు చేశారు. సీఎం సభ నేపథ్యాన బందోబస్తు అత్యంత పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కొత్తగూడెం ఓఎస్డీ సాయిమనోహర్, పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్, సీఐ కరుణాకర్, ఎస్‌ఐలు రవికుమార్, సందీప్, సాయికిశోర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, నాయకుడు దారా యుగంధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాఘవయ్య

పాల్వంచ: సరైన చికిత్స అందించకుండానే అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని వేరే ఆస్పత్రికి రిఫర్ చేశారని ఆరోపిస్తూ బాధితులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. శనివారం పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ములకలపల్లి మండలం పూసుగూడెంనకు చెందిన దేవీ కొన్ని రోజుల కిందట అనారోగ్య సమస్యతో చేరింది. రూ.2 లక్షల వరకు బిల్లు చేసి వేరే ఆస్పత్రికి వైద్యులు వెళ్లమంటున్నారని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. కాగా, సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాఘవయ్య ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఆందోళనను విరమింపజేశారు.

జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణం



వేముల సాహితి

ఖమ్మంస్పోర్ట్స్: కేరళ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన వేముల సాహితి 72 కేజీల కేటగిరీలో స్వర్ణపతకం గెలుచుకుంది. ఇప్పటికే ఆమె ఇదే టోర్నీలో వరుసగా మూడుసార్లు విజయం సాధించగా, నాలుగో సారి కూడా పతకం సాధించి సత్తా చాటింది. సాహితిలో ప్రతిభను గుర్తించిన ఫెడరేషన్ నిర్వాహకులు మలేషియాలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం కవిత డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఆమె పతకం సాధించడంపై పలువురు అభినందించారు.

మందు పాతర పేలి యువకుడికి తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దుబ్బమరక – చోటుకేద్వాల్ అటవీ మార్గంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి బైక్‌పై వెళ్తున్న డబ్బామర్క గ్రామానికి చెందిన యువకుడు వెట్టి గంగాకు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు సదరు యువకుడిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

టేకులపల్లి: కులం పేరుతో తిట్టి దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై బోడు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బత్తిని రంజిత్ కథనం ప్రకారం.. మండలంలోని పాతలచ్చగూడెం గ్రామానికి చెందిన స్నేహితులైన ఎండీ ఖలీద్‌పాషా, కుంపటి సుధాకర్ మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఇటీవల కలిసిన వీరిద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో పాషా కులం పేరుతో దూషించడమే కాకుండా సుధాకర్‌పై దాడి చేయడంతో స్పృహకోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య కుంపటి కల్యాణి ఫిర్యాదు మేరకు పాషాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు

- ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగి మృతి

పాల్వంచ: ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు చెట్టుకు ఢీకొట్టడంతో ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బూర్గంపాడు మండలం గోపాలపురానికి చెందిన ఎస్‌కే లాల్‌పాషా (40) భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం భద్రాచలం నుంచి విజయవాడకు కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. కాగా పాల్వంచ శ్రీనివాసకాలనీ సమీపంలో కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. కారు స్టీరింగ్ చాతి భాగంలో బలంగా తగిలింది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడి భార్య గతంలో కోవిడ్‌తో మృతి చెందగా.. కుమారుడు, కుమార్తె ఉన్నారు. లాల్‌పాషా సోదరుడు పెద్దయాకూబ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

మధిర: మధిర రైల్వేస్టేషన్, ట్రాక్ పరిసరాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ గంజాయి తరలిస్తున్న వ్యక్తుల వివరాలు తెలియరాలేదు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ ఎం.ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలను రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు జి.చంద్రశేఖర్, ఎం.శార్వాణి, ఉద్యోగులు సీహెచ్.గోపి, షేక్ రియాజ్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,196

'కారు' తొలిసారి!



ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు తొలిసారిగా కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు. వీరిలో కొందరు గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ గూటికి చేరగా.. సిట్టింగ్‌లకే టికెట్లు అన్న ప్రకటన మేరకు కేసీఆర్ బీఫామ్‌లు ఇచ్చారు. దీంతో తొలి సారిగా కారు గుర్తుపై పోటీ చేయనున్నారు. – బూర్గంపాడు

బీఆర్‌ఎస్‌లోనే ఉన్నా తొలిసారి గుర్తుపై పోటీ

- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పలు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఒకసారి వైఎస్సార్‌సీపీ నుంచి, మిగతా అన్నిసార్లు కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగి గెలిచాక బీఆర్‌ఎస్‌లో చేరారు. తొలిసారి కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు.
- పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు 2009, 2018లో పినపాక అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న ఆయన ఈసారి అదే పార్టీ నుంచి కారు గుర్తు పై పోటీ చేస్తున్నారు.
- ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత ఆమె గులాబీ పార్టీలో చేరారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.
- అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన కూడా టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసారి ఎన్నికల్లో కారు గుర్తుపై తొలిసారి పోటీలో ఉన్నారు.
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలవగా, అనంతరం పరిణామాల్లో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పుడు ఆయన సైతం బీఆర్‌ఎస్ నుంచి పోటీకి దిగుతున్నారు.
- పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి బీఆర్‌ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్ గూటికి చేరగా.. ఈసారి ఆయన సిట్టింగ్ కోటాలో బీఆర్‌ఎస్ బీఫామ్ దక్కించుకున్నారు.
- వైరా నుంచి లావుడ్యా రాములునాయక్ ఇండిపెండెంట్‌గా గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయనకు ఈసారి టికెట్ దక్కలేదు. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా టికెట్ అందుకున్న బానోతు మదన్‌లాల్ తరఫున ప్రచారంలో నిమగ్నమయ్యారు.
- పినపాక నుంచి గత ఎన్నికల్లో రేగా కాంతారావు కాంగ్రెస్ తరఫున, పాయం వెంకటేశ్వర్లు బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేశారు. ఈసారి మారిన పరిణామాల నేపథ్యాన వారిద్దరి కండువాలు తారుమారు కాగా.. మళ్లీ ప్రత్యర్థులుగానే బరిలో ఉన్నారు.
- ఇల్లెందు అసెంబ్లీ స్థానం నుంచి కూడా పాత అభ్యర్థులే పోటీ చేస్తున్నా పార్టీలు మాత్రం మారాయి. గత ఎన్నికల్లో బానోతు హరిప్రియ కాంగ్రెస్ నుంచి, కోరం కనకయ్య బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేశారు. ఆ తర్వాత హరిప్రియ బీఆర్‌ఎస్‌లోకి రాగా, ఇటీవల కనకయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. ఇలా ఈసారి మళ్లీ ఇద్దరు పోటీ పడుతున్నప్పటికీ పార్టీలు వేర్వేరు కావడం విశేషం.

ఎన్నికల్లో ధనబలాన్ని నిరోధించాలి

- ఫైనల్లేని అభ్యర్థులు పోటీ చేసే పరిస్థితి లేదు
- డబ్బులు వెదజల్లే దుస్థితి మారాలి
- మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య మనోగతం



మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య

ఇల్లెందు: 'ఎన్నికల్లో ధన బలాన్ని నిరోధించి, ఓట్ల కోసం రూ.కోట్లు ఖర్చు చేసే విధానాన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాలి. ఓటుకు ఎంత అనే పరిస్థితి వచ్చింది. నేతలు చెప్పే మాటలకు ప్రాణత్యాగం చేయాల్సి వచ్చినా వెనుకడుగు వేయాలని అనిపించేది కాదు. స్వేచ్ఛగా నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసుకునే అవకాశం ఉండేది.'అని మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య తెలిపారు. ఎన్నికల సందర్భంగా 'సాక్షి' ఆయన్ను పలకరించగా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన మాటల్లోనే..

ఎన్నికల్లో ధన బలానికి ఉన్న ప్రాముఖ్యత ప్రాంతాలకు, ప్రజల సమస్యలకు లేదు. అభ్యర్థి ఖర్చుకు ప్రత్యర్థి రెట్టింపు ఖర్చు చేస్తున్నారు. అభ్యర్థులకు గుణగణాలను చూడటం లేదు. ఒకనాడు ప్రతీ ఓటరు ఈ అంశాలనే పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు అభిమానం, అభివృద్ధి అనే ఆలోచన ఓటరుకు రాకుండా ఓట్ల కోసం రూ.కోట్లు వరదలా పారిస్తున్నారు. ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలి. నచ్చిన నాయకుడిని, మెచ్చిన పనిని చూసి ఓటు వేయాలి. ఎన్నికల కమిషన్ ఉన్నా ధన బలాన్ని నిరోధించలేకపోతోంది. ఆకస్మికంగా తనిఖీలు చేసినా ధన ప్రవాహం ఆగటం లేదు. పేదలు ఈ ఎన్నికల్లో పోటీ పడే పరిస్థితి లేకుండా పోయింది. పాలకులు తాము చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరే అవకాశం లేదు. ఇక రాజకీయ పార్టీల పొత్తులు కూడా విచిత్రంగా ఉన్నాయి.

1982–83లో అబయ్య సుదిమళ్ల సర్పంచ్‌గా పని చేస్తుండగా సీపీఐ బూర్గంపాడు అసెంబ్లీ నుంచి బరిలో దించింది. నాదెండ్ల భాస్కర్ ఎపిసోడ్ కారణంగా అనతి కాలంలోనే మళ్లీ ఎన్నికలు రాగా, అదే స్థానం నుంచి ఓటమి చెందారు. 1994లో ఇల్లెందులో మిత్ర పక్షాలు బలపర్చిన అభ్యర్థిగా గెలుపొందిన ఆయన 2009లోనూ ఇల్లెందులో టీడీపీ నుంచి గెలుపొందారు. ఇక 2018లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

ఎన్నికల నియమావళి ఇలా..

ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవు



ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రచారం, ఖర్చు తదితర విషయాలపై పలు ఆంక్షలను ఎన్నికల సంఘం విధించింది. పార్టీల అభ్యర్థులే కాక ఉద్యోగులు కూడా కోడ్ అమల్లో భాగంగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఎన్నికల సంఘం కొరడా ఝులిపించే అవకాశముంది.

నిబంధనలు ఇవీ..

- ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించొద్దు.
- కులం, మతం, భాష ప్రతిపాదికన ఎవరినీ ఓట్లు అడగొద్దు. ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ఓటర్లను ప్రలోభపెట్టేలా ప్రచారం చేయకూడదు.
- ప్రైవేట్ స్థలాలు, భవనాలు వినియోగిస్తే యజమానుల నుంచి రాతపూర్వకంగా తీసుకున్న అనుమతిపత్రాలను ఎన్నికల అధికారులకు అందజేయాలి.
- ఇతర పార్టీలకు చెందిన కరపత్రాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, జెండాలను ఎట్టి పరిస్థితుల్లో తొలగించొద్దు.
- పార్టీలు కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించిన సంస్థ, ప్రచురణకర్త పేరు, సంఖ్య ముద్రించాలి.
- రాజకీయ పార్టీల బహిరంగ సభల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదు.
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ శాఖల అధికారులు ఎలాంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయొద్దు. కోడ్ పరిధిలోకి వచ్చే ప్రజాప్రతినిధుల వెంట ప్రభుత్వం కేటాయించిన సెక్యూరిటీ సిబ్బంది తప్ప ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదు.
- ఓటర్లను మభ్యపెట్టేలా హామీలు ఇవ్వడం కానీ డబ్బులు పంచడం చేయొద్దు.
- ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా బహిరంగసభలు, ఊరేగింపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారు. అలాగే, వాహనాలు, లౌడ్ స్పీకర్లు వినియోగానికి అనుమతి తప్పనిసరి.
- రాజకీయ పార్టీలు తెల్లకాగితంపైనే ఓటరు స్లిప్పులు అందించాలి. వాటిపై ఎలాంటి పార్టీ గుర్తులు, రంగులు ఉండకూడదు.

ఇదీ మా మేనిఫెస్టో!

అభ్యర్థులకు సమస్యలను తెలిపేలా కరపత్రాలు



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కరపత్రంతో సురేందర్‌రెడ్డి

కారేపల్లి: సాధారణంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి పార్టీల మేనిఫెస్టో ఆధారంగా ప్రచారం చేయడం ఆనవాయితీ. అయితే, సింగరేణి (కారేపల్లి) గ్రామ ప్రజల తరఫున సామాజిక కార్యకర్త సురేందర్‌రెడ్డి గ్రామంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు వైరా నియోజకవర్గ అభ్యర్థులకు తెలిసేలా కరపత్రాలు ముద్రించాడు. వీటిని ప్రజలకు అందజేస్తూ ప్రచారానికి వచ్చే నాయకులకు సమస్యలను వివరించాలని కోరుతున్నారు. బొగ్గుగనుల పుట్టినిల్లయిన సింగరేణి(కారేపల్లి) గ్రామాభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు కేటాయించాలని, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని, కారేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, 60 ఏళ్ల చరిత్ర ఉన్న కారేపల్లి సంతను అభివృద్ధి చేయాలనే తదితర డిమాండ్లను ఆయన కరపత్రంలో ముద్రించాడు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

అశ్వారావుపేట: ఏపీ, తెలంగాణ సరిహద్దులోని అశ్వారావుపేట, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాల సరిహద్దులో శుక్రవారం ఎక్సైజ్ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అశ్వారావుపేట మండల సరిహద్దుకు 5 కిలోమీటర్ల పరిధిలోని కుక్కునూరు మండలం లంకాలపల్లి, వేలేరుపాడు మండలం మేడిపల్లి, మాదారం, కమ్మరిగూడెం, జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం, పూచికపాడు, అశ్వారావుపేట మండలం కొత్తూరు, గుమ్మడవల్లి, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి 9 లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగయ్య తెలిపారు. దాడులు నిరంతరం జరుగుతాయని నాటుసారా తయారీ, రవాణా చేయొద్దని అవగాహన కల్పించారు. దాడుల్లో అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ నాగయ్య, కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం ఎస్‌ఐబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ వ్యర్థాలు వేసేవారికి జరిమానా

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు గోదావరి కరకట్ట వద్ద ఉన్న డంపింగ్ యార్డులో వ్యర్థాలు వేస్తున్న వ్యవహారంపై ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'చెత్తలోనే ఆస్పత్రి వ్యర్థాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన పంచాయతీ అధికారులు డంపింగ్‌యార్డులో మెడికల్ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో నిఘా పెట్టారు. శుక్రవారం మెడికల్ వ్యర్థాలు తీసుకొచ్చి డంపింగ్ యార్డులో వేస్తున్న హెచ్‌ఎస్‌కే మెడికల్ ఏజెన్సీస్‌కు చెందిన పదిలం రమేశ్‌కు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.10 వేలు జరిమానా విధించారు.

నాపై ఆరోపణలు సరికాదు..



మాట్లాడుతున్న జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో లేనటువంటి గిరిజన, గిరిజనేతర సమస్యను తనపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన తల్లితండ్రులు కూలి చేసి తనను చదివించారని.. విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. ఆదర్శవంతమైన ఉపాధ్యాయుడిగా సేవలందించానని, తనపై తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని తెలిపారు. సున్నం నాగమణితో మాట్లాడి, అందరినీ కలుపుకుని పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బండి పుల్లారావు, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు తదితరులున్నారు.

పాఠశాలకు తాళం వేసిన తల్లిదండ్రులు

డిప్యూటేషన్‌పై వెళ్లిన సార్ వస్తేనే పిల్లలను పంపిస్తామని వెల్లడి



టేకులపల్లి 'ఏ' కాలనీ తండాలోని పాఠశాలకు తాళం వేస్తున్న తల్లిదండ్రులు

టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి పంచాయతీ 'ఏ' కాలనీ తండా ప్రాథమిక పాఠశాలలో రెండేళ్ల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు భూక్యా శంకర్‌ను ఇటీవల డిప్యూటేషన్‌పై ఇంకో పాఠశాలకు కేటాయించారు. అయితే, తమ పిల్లలను తీర్చిదిద్దిన శంకర్ మళ్లీ వస్తేనే విద్యార్థులను బడికి పంపిస్తామని, అప్పటివరకు పాఠశాల తాళం కూడా తీయనిచ్చేది లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఉండగా, శంకర్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాల్సిందేనంటూ తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు తాళం వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు బానోతు క్రాంతికుమార్, అజ్మీరా రవికుమార్, ధరావత్ వీరు, బాబూరావు, మహేశ్, గుగులోత్ కృష్ణ, బోడ ఉమ, లాలు, రమేశ్, చిన్నా మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లోనే శంకర్‌ను డిప్యూటేషన్‌పై పంపిస్తే తాము ఉన్నతాధికారులకు విన్నవించడంతో ఇక్కడే కొనసాగిస్తామని తెలిపారు. కానీ, మూడు రోజుల కిందట రిలీవ్ చేశారని పేర్కొన్నారు. దీంతో వారు తాళం వేయగా, విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఉపాధ్యాయురాలు రామకోటేశ్వరి సమయం ముగిసే వరకు బయటే కూర్చుని వెళ్లిపోయారు.

బీజేపీలో నాయకులకు మంచి భవిష్యత్



మురళీధర్‌రావును సన్మానించిన బీజేపీ నాయకులు

పాల్వంచ: బీజేపీలో క్రమశిక్షణతో మెలిగే కార్యకర్తలకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని.. అందుకు తానే ఉదాహరణ అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు తెలిపారు. గురువారం రాత్రి ఆయన మండలంలోని పెద్దమ్మతల్లి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతూ బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పానిశెట్టి వెంకటేశ్వర్లు, మాలోతు ప్రశాంత్, మాదారపు లక్ష్మణ్, జలీల్, ముకుందరావు, క్రాంతి, సీతారాం, హాదిరామ్, విజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో తొలిసారిగా ఆపరేషన్

- వైద్య బృందాన్ని అభినందించిన కలెక్టర్



ఆపరేషన్ చేసిన వైద్య బృందం

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో తొలిసారిగా ఓ గర్భిణికి ఆపరేషన్ చేశారు. కలెక్టర్ ప్రియాంక ఆల స్థానిక వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం తల్లీబిడ్డను ఆస్పత్రి నుంచి డిస్చార్జ్ చేసిన సందర్భంగా వైద్యులు వివరాలు వెల్లడించారు. మండలంలోని వేదాంతపురం గ్రామానికి చెందిన గర్భిణి ఎస్‌కే సుభాని గత నెల 31న ఆస్పత్రికి రాగా, పరీక్షించిన వైద్యురాలు రాధారుక్మిణి సాధారణ కాన్పు సాధ్యం కాకపోవడంతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు పర్యవేక్షణలో ఆపరేషన్ చేయగా మూడు కేజీల బరువు ఉన్న బాబు జన్మించాడు. గతంలో ఇలాంటి ఆపరేషన్ల కోసం భద్రాచలం, కొత్తగూడెం వెళ్లాల్సి వచ్చేంది. కాగా, కలెక్టర్ ప్రియాంక ఆల అశ్వారావుపేట సీహెచ్‌సీకి గైనకాలజిస్ట్‌ను కేటాయించడంతో తొలిసారిగా ఆమె గర్భిణికి ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ.. స్థానిక సీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి, ప్రసూతి వైద్యురాలిని అందుబాటులో ఉంచామని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ ముక్కంటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నగదు సీజ్..

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడిన నగదును పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం మండలంలోని మందలపల్లి చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనదారుడి వద్ద రూ.58,400 లభించగా ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



నెట్‌బాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో కోచ్‌లు, పీఈటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి అండర్ – 14 బాలబాలికల నెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో శుక్రవారం జరిగిన ఎంపిక పోటీలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిలో జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు సూర్యతేజ, లోకేశ్, వినయ్, సిద్ధూ, జగన్, వివేకానంద, రాంచరణ్, ఉజ్వల్ అయాన్, నవదీప్ వినయ్, కార్తికేయ, రాజు, వరుణ్ ఎంపిక కాగా.. బాలికల విభాగంలో అవంతిక, శ్రీవాణి, మహేశ్వరి, ఎఫ్సిబా, నందిని, సింధుప్రియ, హారిక, ధనలక్ష్మి, సమీరా, పవిత్ర, సింధు, ప్రసన్నకుమారి, గౌతమి పూర్ణిమ ఎంపికయ్యారు. జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహమూర్తి, నెట్‌బాల్ సీనియర్ కోచ్ పీవీ రమణ, పీఈటీ కృష్ణ, సైదేశ్వరరావు, బిక్కెన్, రోజా, రవి తదితులు పాల్గొన్నారు.



బాలికల జట్టు

ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!



ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధనత్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్టెటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందు వల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రిగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ-కాఫీ మరకలు

టీ-కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు ''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.



● 'ది ట్రయల్' పోస్టర్

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్

''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.

